
**కథ**

**ఆ**నంద్ అయిదు కిలోమీటర్లు యధాప్రకారం నడిచి, సాయంకాలం ఆరున్నరకి యింటికి వచ్చాడు. వస్తూనే రెండు గ్లాసులు మంచి నీళ్ళూ, భార్య యిచ్చిన టీ తాగి, కుర్చీలో కూర్చుని ఆలోచించసాగాడు. తనకి ఒక్కత్తే కూతురు. ఎమ్.ఎ. ఫస్ట్‌క్లాసులో ప్యాసయింది. అప్పుడే ఇరవై నాలుగేళ్ళు వచ్చేసాయి. పెద్దయిన తర్వాత యింత అందంగా ఉంటుందని తెలీకుండానే, 'ముదితామానస' అని అందమైన పేరే పెట్టారు.

# మానస రమణీయం



''ఇంకా అలాగే కూర్చున్నారేమిటి, లేచి ముఖం కడుక్కోండి. ఏమిటి ఆలోచిస్తున్నారు!'' అంది ఆనంద్ భార్య, ఆశాలత.

''ఏం లేదు, ఒక ముఖ్యమైన విషయం! మా ఆఫీసులో అతను ఒక మంచి సంబంధం చెప్పాడు, మన మానసకి. పిల్లాడు ఈ నెలలో అమెరికా నుంచి వస్తున్నాడట. ఇంజనీరు. కట్నం అఖ్ఖర్లేదు వాళ్ళకి. మనకిష్టమైతే అతను ప్రయత్నం చేసి కుదురుస్తానన్నాడు. ఏ విషయం రెండు రోజుల్లో అతనికి చెప్పాలి.''

''ఎక్కడ? అమెరికాదాకా పిల్లని పంపించేద్దామా? మనకి ఈ పిల్ల ఒక్కర్తేకదా సంతానం! అయినా మీ అక్కయ్య కొడుకు జానకిరమణకి యిద్దామనుకున్నాం కదా'' అంది ఆశాలత.

''నిజమే అనుకో! కానీ, మా బావ ఒక పట్టాన ఏ విషయం తేల్చడు. ఏమైనా అడిగితే చేతులు ఆకాశంకేసి చూపిస్తాడు. భూమ్మీద విషయాలే తేలడం కష్టంగా ఉన్న ఈరోజుల్లో, ఆకాశంలో ఏం తేలతాయి. మామూలుగా ఆకాశంలో ఎగిరే విమానాలు కూడా భూమ్మీద చతికిలబడుతున్నాయి'' అన్నాడు ఆనంద్.

''మనం ఎప్పుడైనా వాళ్ళని ఏం చెయ్యదలచుకున్నారని ఖరాఖండీగా అడిగామా! మనం ఏమిస్తామో ఏమిటో వాళ్ళకి తెలియపరిస్తే, వాళ్ళు ఏమనుకుంటున్నారో తెలుస్తుంది. అంతేగానీ వాళ్ళేమీ తేల్చటం లేదు, అనుకుంటూ మనం ఊరుకుంటే పిల్లకి షష్ఠి పూర్తైపోతుంది.

మీ అక్కయ్యకు నన్ను ఫోన్ చెయ్యమంటే చేస్తా'' అంది ఆశాలత.

''వద్దులే.. ఎంతో వ్యవధి లేదు. నీకిష్టం లేకపోతే ఈ అమెరికా సంబంధం యింట్లో వాళ్ళు ఒప్పుకోవడం లేదని చెప్పేస్తాను'' అన్నాడు ఆనంద్.

''తెల్లారి లేస్తూనే మానస ముఖం చూడకుండా ఉండలేం. ఎక్కడికైనా వెళ్ళి అరగంట ఆలస్యంగా వస్తే, వీధిలోనే నిలబడి ఉంటాం కదా! అమెరికా అంటే ఎంత దూరమో తెలుసుకదా! మీకు నిజంగా అంత దూరపు సంబంధం చెయ్యడం యిష్టమా! ఆలోచించి చెప్పండి.

నా విషయం నేను చెప్పేస్తున్నాను. నాకు మాత్రం యిష్టంలేదు'' అంది ఆశాలత.

''సర్లే యిప్పటికి ఈ సంబంధం వద్దని చెప్పేస్తాను'' అన్నాడు ఆనంద్.

★ ★ ★

''ఈ సంక్రాంతికి మీ బావగార్ని, అక్కయ్యనీ, పిల్లాడ్ని మన యింటికి రమ్మనండి. ఏదో అవకాశం చూసుకుని ఈ సంబంధం విషయం తేల్చుకుందాం'' అంది ఆశాలత.

భార్య చెప్పినట్లే ఆనంద్ వాళ్ళ అక్కయ్యనీ వాళ్ళనీ ఆహ్వానించడం, వాళ్ళు రావడం కూడా జరిగాయి.

సంక్రాంతినాడు, మధ్యాహ్నం భోజనాలయిన తర్వాత, ఆనంద్ తన అక్కయ్యతో మానస పెళ్ళి గురించి కదిపాడు.

''అవునురా తమ్ముడూ! నిజమే మానసకి తొందర్లోనే పెళ్ళి చేసెయ్యాలి'' అంది కాని, తన కొడుకు గురించి ఏం మాట్లాడలేదు. ఈలోపులో ఆనంద్ బావ కూడా అక్కడకి వచ్చి ''ఏమిటీ, అక్కా తమ్ముడూ ఏవో మంతనాలు ఆడుకుంటున్నారు'' అన్నాడు.

ఇంక డైరెక్ట్‌గా చెప్పకపోతే లాభం లేదని, ''ఏముంది బావా! మా మానసని మీ జానకీర

**భమిడిపాటి సోమయాజి**

మణికిచ్చి పెళ్ళి చేస్తే బాగుంటుందని నా కోరిక. ఈ విషయంలో మీ అభిప్రాయం చెపితే మేం సంతోషిస్తాం'' అన్నాడు ఆనంద్.

ఆనంద్ బావ పితృదేవతలతో మాట్లాడుతున్నట్లు పైకి చూశాడు. ''అవునయ్యా! మా చెల్లెలు ఆశాలతకి అమెరికాలో ఉన్న పిల్లలకి యివ్వడం యిష్టంలేదని, నాకు చూచాయగా తెలిసింది. నిజమేనా!'' అన్నాడాయన.

''మన పిల్లాడు యిండియాలోనే ఉన్నాడు కదా బావగారూ!'' అన్నాడు ఆనంద్.

''ప్రస్తుతం ఉన్నాడయ్యా! వాడి ఫ్రెండ్స్ చాలా మంది అమెరికాలో ఉన్నారు. మరి వీడు కూడా వెడదామని చూస్తున్నాడు.

వాడు కూడా ఈ సంక్రాంతికిక్కడికి వస్తే, డైరక్ట్‌గా వాడితోనే మాట్లాడే వాళ్ళం'' అన్నాడు ఆనంద్ బావ.

## రాజకీయం

**తారల ఇమేజ్‌ని క్యాష్ చేసుకోవడానికి రాజకీయపార్టీలు ఎప్పుడూ ముందుంటాయి. అందాలభామ సెలీనాజైట్లీ ఇప్పుడు కాంగ్రెస్ తరపున ప్రచారం చేయడానికి ముందుకొచ్చింది. 'ఈనాటి యువతకి సరైన అవకాశాలివ్వడంతో పాటూ దేశానికి మంచి భవిష్యత్తుని ఇవ్వగలదు. దేశవ్యాప్తంగా తిరిగి విస్తృతస్థాయి ప్రచారం చేస్తా' అంటోంది. ఈ ప్రచారం తరువాతైనా ఆమెకి మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆమె సన్నిహితులంటున్నారు. చూద్దాం. ఏం జరుగుతుందో?**

'అసలందుకే జానకీ రమణని తీసుకొచ్చి ఉండరు వీళ్ళు' అనుకున్నాడు ఆనంద్.

సరే పండగలైపోయాయి. అక్కా బావా వెళ్ళడం కూడా అయిపోయింది. విషయం మాత్రం తేల్లేదు.

తర్వాత ఆశాలత అంది ఆనంద్‌తో.

''ఈ సంబంధం విషయం ఒక పట్టాన తేల్చేటట్లు లేదు, మీ బావగారు! తన కొడుకు అమెరికా ప్రపోజల్ పెట్టి మన నోళ్ళు మూయించేశాడు. ఈయన దేవాంతకుడే! అయినా కాకపోతే మీ అక్కయ్యనెందుకిస్తార్లెండి'' అంది ఆశాలత.

''సర్లే తర్వాత మమ్మల్ని దెప్పుదువుగానీ, నీ సలహా వల్ల ఈ పండగకి ఖర్చు రెండు వేల అయిదు వందలైంది. పైగా ఈ సంబంధం విషయం కదుపుతాం కదా అని, రాకపోయినా ఆ జానకీ రమణకి కూడా బట్టలు కొనిచ్చాను. అయిందేదో అయింది. యిప్పుడేం చెయ్యాలో, ఆలోచిద్దాం'' అన్నాడు ఆనంద్.

పది రోజుల తర్వాత ఆనంద్ అక్కయ్య ఫోన్ చేసింది. ''అరే తమ్ముడూ, నువ్వేమీ అనుకోకు. రమణగాడు అమెరికా వెడతానంటున్నాడు. రెండు లక్షలయ్యేటట్లుంది. మీ బావగారు చాలా బాధపడుతున్నారు. ఏం చెయ్యాలో తోచక. మా దగ్గర ఏభై వేలుంది అనుకో. నీ సలహా ఏమిటి. అసలు అమెరికా పంపిస్తే మంచిదంటావా? మానేస్తే మంచిదా? అన్ని విషయాలూ ఆలోచించి చెప్పు. రెండ్రోజుల్లో ఫోన్ చేస్తాను''

''ఎవరండీ ఫోన్. ఎస్.టి.డిలా వుంది'' అంటూ వంటింట్లోంచి వచ్చింది, తడి చేతులు తుడుచుకుంటూ ఆశాలత. అక్కయ్య చెప్పిన విషయాలు, ఆశాలతకి చెప్పాడు ఆనంద్.

అన్నీ విని ''యిన్నాళ్ళు మీ బావే దేవాంతకుడనుకున్నాను. మీ అక్కయ్య కూడా ఆ కోవకి చెందినదేనని యిప్పుడు తెలిసింది నాకు. అసలు దీని అర్థమేమిటో తెలిసిందా మీకు!'' అంది ఆశాలత.

''ఏముంది అర్థం? పిల్లాడు అమెరికా వెళ్ళడానికి ఏదైనా సహాయం చేస్తామంటే, మన దగ్గర ఎంత డబ్బుందో తెలుసుకుని, మనం ఎంత కట్నం యివ్వగలమో అంచనా వేసుకోవడం. రెండోది మన సలహా ప్రకారం అమెరికా వెళ్ళడం మానేసాడని చెప్పి సంబంధం ఖాయం చేసుకుని, ఆ డబ్బు కట్నంగా గుంజడం'' అన్నాడు ఆనంద్.

''సరిగ్గానే అర్థమయింది. మీ బావకి తగ్గ భార్య మీ అక్కయ్య మీ అక్కకి తగ్గ తమ్ముడు మీరూనూ!'' అంది ఆశాలత.

''అది సర్లే! మనం ఏం చెయ్యాలో చెప్పు'' అన్నాడు ఆనంద్.

''మీరు ఊరుకోండి. మీ అక్కయ్య పని నేను పడతాను'' అని, ఆరోజు రాత్రి తన ఆడపడుచుకి ఫోన్ చేసి చెప్పింది ఆశాలత- ''మీరు పొద్దున్న ఫోన్ చేశారట. ఆ విషయాలు గురించి మీ తమ్ముడు ఆలోచిస్తున్నారు.

ఈలోగా మాకొక సలహా చెప్పండి వదినగారూ! ఒక అబ్బాయి అమెరికాలో యింజనీరుట. మన శాఖ కాదు కాని, మంచి కుటుంబం. వాళ్ళు కట్నం తీసుకోరు. పెళ్ళి మాత్రం బాగా చెయ్యాలిట. అమెరికా దూరం అనేకానీ, పిల్ల సుఖపడుతుంది. తిరిగి చూసుకోనక్కర్లేని సంబంధం. మన మానసకి చేస్తే ఎలా ఉంటుంది. ఆలోచించి చెప్పండి. ఎక్కువ వ్యవధి లేదు. మళ్ళీ రేపు ఫోన్ చేస్తాను'' అని పెట్టేసింది.

ఆనంద్ అక్కయ్య ఖంగుతింది. దూరం కదా ఖంగుమన్న శబ్దం మాత్రం ఆశాలతకి వినపళ్ళేదు.

ఈ విషయాలు భర్తతో చెప్పింది ఆనంద్ అక్కయ్య. ''చిన్నప్పట్నుంచీ మానస మనకి తెలుసున్న పిల్ల. పైగా మనకి ఒక్కడే కొడుకు. అనవసరంగా కట్నానికి ఆశపడి ఎక్కువ గుంజుదామని, నిన్న నా చేత మా తమ్ముడికి ఫోన్ చేయించారు. ఎవరో తెలియని పిల్లని కోడలిగా తెచ్చుకుంటే, ఆ పిల్ల మనల్ని ముసలితనంలో సరిగ్గా చూడకపోతే, తర్వాత ఏడవాలి.

మా ఆశాలత చెప్పిన సంబంధం కట్నం లేదు కదా, అమెరికా అయితే అయిందని, వాళ్ళు కుదిర్చేసుకుంటే మనం జీవితాంతం ఏడవాలి. పైగా జానకీ రమణ కూడా మానసంటే మనసు పడుతున్నాడు. ఏం చేస్తారో మీ యిష్టం'' అంది.

ఈసారి ఖంగుతినడం ఆనంద్ బావ వంతైంది.

ఆ మర్నాడు, జానకీరమణ అమెరికా ప్రపోజల్ డ్రాప్ అయిందనీ, ఎలా అయినా ఇండియా సంబంధం అంటేనే ఆశాలతకి యిష్టం కనుక, కట్నం అక్కర్లేదనీ ఆనంద్‌కి ఫోన్ చేసి చెప్పింది, అతని అక్కయ్య.

మానసా రమణల పెళ్ళి చాలా బాగా అయింది. పిల్ల అత్తారింటికి వెళ్ళింది.

ఆనంద్ ఆశాలతతో అన్నాడు.

''మా బావకి తగ్గ భార్య మా అక్కయ్య! మా అక్కయ్యకు తగ్గ తమ్ముడ్ని నేను. నాకు తగ్గ భార్యవి నువ్వు. మొత్తం మీద ఎవరికి ఎవరూ తగ్గలేదు''

